# శ్రీసప్తగిరీశుని కళ్యాణవేడుక



ఆధ్యాత్మిక జ్ఞానపీఠం

చిలకలూరిపేట

# శ్రీసప్తగిరీశుని కళ్యాణవేడుక

వెంకటేశ వెంకటేశా గోవింద |

శ్రీనివాస శ్రీనివాసా గోవింద |

1. కలియుగ వైకుంఠం

తిరుమల తిరుపతిలో గోవింద |

2. వెలసిన శ్రీనివాసుని

దివ్యచరితమిదియే గోవింద |

3. ఈ చరితమువింటే

శుభములు కలిగేనూ గోవింద |

4. పద్మావతి పతితాను

వరముల నిచ్చేనూ గోవింద |

5. భువిజనులీచరితం

వినితరియించంగా గోవింద |

6. వినిపించెద హరికృపతో

ఈ కథ వివరముగా గోవింద |

7. భరతఖండ ఉత్తరమందు

నైమిశమను అడవీ గోవింద |

8. ధ్యాన మగ్నులై ఋషులు

తపములు చేయంగా గోవింద |

9. అట్టి పవిత్ర స్థానములో

వ్యాస శిష్యుడైనా గోవింద |

10. సూతుండొక ఆశ్రమము

నిర్మించుకయుండే గోవింద |

11. శౌనకాది మునులంతా

సూతుని దరిచేరీ గోవింద |

12. శ్రీనివాస చరితమును

వినిపింపగ కోరే గోవింద |

13. తెలియజేసిరా చరితం

సూతులవారిట్లూ గోవింద |

14. కృతత్రేతా ద్వాపరము

గడచిన పిదపా గోవింద |

15. నాల్గవదైనా కలియందు

ప్రబలెను అధర్మమూ గోవింద |

16. కశ్యపాది మునులంతా

తరుణోపాయముగా గోవింద |

17. యాగము చేయగతలచే

మునులందరి తోడా గోవింద |

18. అప్పుడు మహర్షి నారదుడు

జనుల బాధలను చూచీ గోవింద |

19. బ్రహ్మను చేరడిగే

ఉపాయమేమిటనీ గోవింద |

*20*. నవ్వుతు ఆబ్రహ్మ

తెలిపెను ఉపాయమూ గోవింద |

*21*. అవతరించు హరి త్వరలో

భూలోకము నందూ గోవింద |

*22*. లోకశాంతికై మునులు

గంగానది చెంతా గోవింద |

*23*. యజ్ఞము నారంభించ

నారదుడటకొచ్చె గోవింద |

*24*. సంతోషించిరి మునులు

నారద రాకగనీ గోవింద |

*25*. అడిగెను నారదుడపుడు

ఫలము ఎవరికంటూ గోవింద |

*26*. యజ్ఞఫలము గ్రహియించుటకు

అర్హులే త్రిమూర్తులు గోవింద |

*27*. శాంతస్వరూపులెవరో

వారిదె అధికారం గోవింద |

*28*. పరీక్షింప నా త్రిమూర్తులను

ఎవరికి సాహసమూ గోవింద |

*29*. మొట్ట మొదట భృగువూ

సత్యలోకమేగే గోవింద |

*30*. ఆ సమయానికి బ్రహ్మ

కొలువు తీరియుండే గోవింద |

31. లోనికి వచ్చిన భృగునీ

పలుకరించలేదూ గోవింద |

32. మండిపడిన ఆ భృగువు

శపించె బ్రహ్మనిలా గోవింద |

33. ఇలలో గుడులూ పూజలు

ఇక నీ కుండవులే గోవింద |

34. అని శపియించి భృగువు

కైలాసమునకేగే గోవింద |

35. శివపార్వతులా సమయాన

శృంగారక్రీడ నుండే గోవింద |

36. భృగువును చూచిన పార్వతి

సిగ్గుతో తొలగినదీ గోవింద |

37. శివుడు శీఘ్రమే కోపముతో

భృగువును దూషించే గోవింద |

38. భృగువంతట శివుని

శపియించె నీ రీతిగా గోవింద |

39. ఇక నిను భువిజనులు

పూజింతురు లింగముగా గోవింద |

40. భృగువంతట వైకుంఠం

దర్శించగ హరినీ గోవింద |

41. ఆ సమయములో లక్ష్మి

పదములొత్తుచుండే గోవింద |

42. మహర్షి రాకను ఇరువురునూ

గమనించనె లేదూ గోవింద |

43. తన్నెను ఆవేశముతో

విష్ణు వక్షస్థలినీ గోవింద |

44. ఉలిక్కి పడిన శ్రీహరి

భృగువునుగాంచీ గోవింద |

45. ననుతన్నుటలో పాదం

ఎంతో కందెనుగా గోవింద |

46. అంటూ భృగుపాదాలు

ఒత్తునట్లు పట్టే గోవింద |

47. కాలియందున్న నేత్రమును

చిదిమివేసెనూ గోవింద |

48. తన నివాసమైనట్టీ

విష్ణుహృదయసీమా గోవింద |

49. తన్నిన భృగువును చూచి

కోపముతో శ్రీలక్ష్మీ గోవింద |

50. భరింపజాలక అవమానం

భోరున ఏడ్వసాగే గోవింద |

51. హరి అనునయించబోగా

వినలేదు లక్ష్మీ గోవింద |

52. తీరె ఋణము ఇరువురికీ

ఉండనొక్కక్షణమూ గోవింద |

53. అంటూ అలిగె మహలక్ష్మి

భూలోకము చేరే గోవింద |

54. పుణ్యగోదావరి తీరాన

తపమాచరించ సాగే గోవింద |

55. లక్ష్మీలేని వైకుంఠం

కళాహీనమయ్యే గోవింద |

56. దేవతలంతా ఇది తెలిసి

హతాశులైనారూ గోవింద |

57. లక్ష్మిలేని ఈ వైకుంఠం

ఏలతనకు అంటూ గోవింద |

58. లక్ష్మిని వెదకుచు శ్రీహరి

భూలోకము చేరే గోవింద |

59. నిద్రాహారములు వీడి

శుష్కించెను విష్ణూ గోవింద |

60. చేరె శేషాద్రిగిరిని

అది వెంకటాచలమూ గోవింద |

61. ఈ గిరిపైనే వరాహస్వామి

ఆశ్రమముండేనూ గోవింద |

62. వాయువుకు శేషునికి

తమ బలాల గూర్చి గోవింద |

63. వాదన వచ్చెను ఒకనాడు

ఘర్షణ ముదిరినదీ గోవింద |

64. అంతట నారదుడొచ్చి

చెప్పెను ఉపాయమూ గోవింద |

65. ఎవరినెవరు ఓడించెదరో

వారేబలురంటూ గోవింద |

66. ఒకరిని మించీ ఒకరయ్యే

జీవకోటి జడిసే గోవింద |

67. దేవతలంతా అనినారు

ఇరువురు సమమంటూ గోవింద |

68. శేషుడు హరిని స్మరిస్తూ

పర్వతముగ మారే గోవింద |

69. ఆ పర్వత ప్రదేశమే

వేంకటాద్రి అయ్యే గోవింద |

70. తిరిగి తిరిగి లక్ష్మిని వెదకి

అలసిన శ్రీహరీ గోవింద |

71. చేరుకొనెను శేషాద్రికి

ఒక చింతచెట్టు నీడా గోవింద |

72. అటకు దగ్గరగ ఒక పుట్ట

కనబడగా చూచీ గోవింద |

73. అందులో దాగెను శ్రీహరి

విశ్రాంతి గైకొనగా గోవింద |

74. తిండీ నిద్రా లేకుండా

రోజులు గడుపుటనూ గోవింద |

75. గమనించెను నారదుడంత

శివబ్రహ్మలను కలిసే గోవింద |

76. శ్రీహరి ఆకలి బాపుటకు

ఆవయ్యెను బ్రహ్మ గోవింద |

77. దూడగ మారెను ఈశ్వరుడు

భూలోకము వచ్చిరటా గోవింద |

78. కొల్హాపురియందు

తపము చేయుసిరినీ గోవింద |

79. కలిసిరి బ్రహ్మయు శివుడు

వివరించిరి విష్ణుకధా గోవింద |

80. కధనంతయు విని శ్రీలక్ష్మి

కంటతడి పెట్టెనుగా గోవింద |

81. ఆవుదూడలై శివబ్రహ్మలు

అనెనంతట ఈరీతీ గోవింద |

82. గొల్లకన్యవై నీవు

మము చోళరాజుకమ్మూ గోవింద |

83. మేతకు వెళ్ళీమేమంతా

హరి అకలి తీర్చెదమూ గోవింద |

84. సరియంటూ మహలక్ష్మి

చోళరాజు కడకూ గోవింద |

85. ఆవుదూడలను కొనిపోవ

అవికొన్నాడా రాజూ గోవింద |

86. పశులకాపరులు ప్రతిరోజూ

ఆవూదూడలనూ గోవింద |

87. మేతకై అడవిలోనికి

కొనిపోతుండిరి గోవింద |

88. కడుపు నిండమేసిన ఆవు

సాయం సమయమునా గోవింద |

89. పుట్టనెక్కి రంధ్రముగుండా

పాలందించే హరికీ గోవింద |

90. పాలివ్వని ఆవు గురించీ

తెలిసెను రాజునకూ గోవింద |

91. పశులకాపరిని గద్దించే

అనుమానముతో రాజూ గోవింద |

92. పశులకాపరికి ఇది ఏదో

మాయలాగతోచే గోవింద |

93. యధాప్రకారము మరునాడు

మేతకు కొనిపోవా గోవింద |

94. ఆవుపుట్టపైకెక్కి

పలిచ్చెడి దృశ్యమునూ గోవింద |

95. చూచిన ఆ పశుకాపరికి

పట్టరాని కోపం గోవింద |

96. కలిమి గొడ్డలితొ ఆవును

కొట్టబోయినాడూ గోవింద |

97. తనకుపకారము చేసెడి

గోవును కొట్టుటనూ గోవింద |

98. గమనించిన హరి అంతట

తల అడ్డుపెట్టినాడూ గోవింద |

99. తలకు తగిలినా దెబ్బలతో

ధారగ కారెను రక్తం గోవింద |

100. అదిచూచిన కాపరి

మూర్ఛ పోయినాడూ గోవింద |

101. ఆశ్చర్యముగా ఆరాజు

శేషాచలమున కొచ్చే గోవింద |

102. శ్రీహరి రాజును శపియించె

రాక్షసుడవు కమ్మంటూ గోవింద |

103. రాజు ఒరిగె హరిపదముల

క్షమించు ప్రభువంటూ గోవింద |

104. ఎరుగను స్వామీ ఏపాపం

నన్నేల శపించితివంటూ గోవింద |

105. పుట్టలోన తాముండుటకు

కారణంబు ఏమీ గోవింద |

106. తిరుగులేదు నామటలకు

పద్మావతితో నాపెండ్లీ గోవింద |

107. జరిగిన తక్షణమున

తీరును నా శాపం గోవింద |

*108*. తలకు తగిలినా గాయమును

మాన్పబూనుటకై గోవింద |

*109*. హరివెదకుచు పోవుచుండ

కనిపించెను ఆశ్రమమూ గోవింద |

*110*. ఆశ్రమము బయట నిలుచుండి

అమ్మా! అని పిలువా గోవింద |

*111*. కృష్ణ నామ కీర్తన చేస్తూ

వెలికొచ్చెను ఆ వకుళా గోవింద |

*112*. మురళినూదు శ్రీకృష్ణునిగా

కనిపించెను హరి తనకూ గోవింద |

*113*. వచ్చావా నాక్రిష్ణయ్య!

అని వకుళ మురిసెనంతా గోవింద |

*114*. హరిగాయముకని అయ్యయ్యో

నిన్నెవరు కొట్టిరంటూ గోవింద |

*115*. చీరకొంగుతో గాయానికి

పసరు కట్టు కట్టే గోవింద |

*116*. పూర్వజన్మలో యశోదయే

ఇప్పటి ఈ వకుళా గోవింద |

*117* కృష్ణుని పైనే మమకారం

వీడలేదు ఇంకా గోవింద |

*118*. శ్రీకృష్ణుడు చేసుకున్న

ఎనిమిది పెండ్లిండ్లూ గోవింద |

119. చూడని ఆ యశోదమ్మ

ఆ కోరిక తెలుపా గోవింద |

120. అనుకున్నవన్నీ అమ్మా!

అయిపోయినవిపుడూ గోవింద |

121. కలియుగమున నాకళ్యాణం

చూడగలవు నీవూ గోవింద |

122. మరుజన్మలో ఆ యశోదయే

వకుళ నామమునా గోవింద |

123. వరాహస్వామాశ్రమాన

ఉండసాగెనండీ గోవింద |

124. పూర్వము సుధర్ముడనే

చంద్రవంశపు రాజూ గోవింద |

125. ఆయనకిద్దరు పుత్రులు

ఆకాశరాజు తొండమానులూ గోవింద |

126. రాజపత్ని ధరణీదేవి

సంతానము కొరకూ గోవింద |

127. కులగురువైన శుకమునిని

వేడిరి ఉపాయమూ గోవింద |

128. త్రేతాయుగమున దశరధుడు

చేసెను ఒక యాగమూ గోవింద |

129. పుత్రకామేష్టి నామమది

అది చేయుము నీవూ గోవింద |

130. అట్లే యజ్ఞముకావించె

ఆకాశరాజూ గోవింద |

131. నాగలితో భూమిని దున్న

దొరికెను ఒక శిశువూ గోవింద |

132. ఆమెకు పద్మావతినామము

పెట్టి పెంచసాగే గోవింద |

133. అటుపిమ్మట కుమారుడు

జన్మించెను సుధాముడూ గోవింద |

134. త్రేతాయుగమున పద్మావతియె

వేదవతియను పేరా గోవింద |

135. తపస్సు చేసుకొనుచుండగ

మోహించెను రావణుడూ గోవింద |

136. రాముని తప్ప ఎవ్వరినీ

వివాహ మాడననీ గోవింద |

137. రావణునీ శపియించి

అగ్నిదగ్ధమయ్యే గోవింద |

138. సీతకు బదులుగ లంకకు

వెళ్ళెను వేదవతీ గోవింద |

139. అశోకవనమున తానుండె

సీతరూపుతోడా గోవింద |

140. రావణవధ పిదప

సీత శీలమునకే గోవింద |

141. రాముడు పరీక్షపెట్టి

అగ్నిదూకమనెనూ గోవింద |

142. అంతట సీతకు మారుగా

వేదవతియె వచ్చే గోవింద |

143. తనను కూడ అర్ధాంగిగా

చేపట్టమనెనూ గోవింద |

144. శ్రీనివాసునిగ కలియందు

అవరతరించినపుడూ గోవింద |

145. పెండ్లాడెద నిన్ను

అని అభయమిచ్చెనూ గోవింద |

146. పద్మావతికి పెండ్లీడొచ్చె

నారదుడటకొచ్చే గోవింద |

147. వామహస్తమును చూచి

హరిభర్తగునని చెప్పే గోవింద |

148. తల్లి తండ్రులది విని

సంతసించినారూ గోవింద |

149. హరిపాదాలు కడుగుట

పూర్వజన్మ ఫలమనీ గోవింద |

150. వేంకటాచలమందున

వకుళాశ్రమములో గోవింద |

151. వారిసేవలను గైకొంటూ

హరిగడుపుచుండెకాలం గోవింద |

152. ఒకనాడరణ్య ప్రాంతమును

భీభత్సముచేస్తూ గోవింద |

153. మదపుటేనుగొకటొచ్చె

ఘీంకరించుకొంటూ గోవింద |

154. అది చూచి శ్రీనివాసుడు

ధనసును చేపట్టీ గోవింద |

155. బయలుదేరె నా మదగజము

మద మణగించుటకూ గోవింద |

156 శ్రీనివాసునీ చూడగనె

ఏనుగు వెనుదిరిగే గోవింద |

157 దానిని తరుముతు చనినంత

హరి బహుదూరమూ గోవింద |

158. ఏనుగు కనుమరుగయ్యె

శ్రీనివాసుడలసే గోవింద |

159. విశ్రమించెనూ శ్రీహరి

వటవృక్షముక్రిందా గోవింద |

160. అచటి ప్రకృతి ఎంతో

ప్రశాంతముగ నుండే గోవింద |

161. నీరుత్రాగుటకు తావెళ్ళె

ఉద్యానవనమునకూ గోవింద |

162. పద్మావతి చెలికత్తెలతో

ఆటలాడు చుండా గోవింద |

163. శ్రీనివాసుడామెను చూచి

సమీపించ సాగే గోవింద |

164. నిషిద్ధమీ ఉద్యానవనము

పురుషులెవరికైనా గోవింద |

165. ఆకాశరాజు ఆజ్ఞ ఇది

అని గద్దించిరి చెలులూ గోవింద |

166. పద్మావతి సోయగము గని

పరధ్యానుడయ్యే గోవింద |

167. శ్రీనివాసుడిది వినక

చేరెను పద్మావతినీ గోవింద |

168. పద్మావతి ఆతనిగని

సిగ్గుతో తలవంచే గోవింద |

169. చెట్టు చాటునకు చేరె

చిరు కోపము నటియిస్తూ గోవింద |

170. ఆమెనడిగె శ్రీనివాసుడు

వివాహ మాడమనీ గోవింద |

171. అతడెవరో తెలియక

తృణీకరించినదీ గోవింద |

172. చెలులతనిని కొట్టి

తరుమ చూచినారూ గోవింద |

173. జాలిపడిన పద్మావతి

తన వివరము తెలిపే గోవింద |

174. పద్మావతిని చూడగనే

మతి స్థిమితము తప్పే గోవింద |

175. శ్రీనివాసుడు చేరెను

వకుళాశ్రమమూ గోవింద |

176. అతని మనసులోని మర్మము

అడిగినదా వకుళా గోవింద |

177. ఆకాశరాజుతో వియ్యము

సాధ్యము కాదనెనూ గోవింద |

178. హరిని చూచినది మొదలు

పద్మావతి కూడా గోవింద |

179. మనోవ్యాధితోను

మాటాడదు ఎవ్వరితో గోవింద |

180. శ్రీనివాసుడును అట్లే

విరహముతో వేగే గోవింద |

181. వకుళ బయలు దేరే

సంబంధము కొరకై గోవింద |

182. శ్రీనివాసుడే మారే

ఎరుకల సానిగానూ గోవింద |

183. సోది చెప్పెదను సోదంటూ

అంతఃపురము చేరే గోవింద |

184. అది విని చెలికత్తెలు

రాణికి చెప్పిరిగా గోవింద |

185. పద్మావతి గ్రహస్థితి ఏదో

అడిగెద రమ్మనిరీ గోవింద |

186. జరిగిన విషయములన్నీ

సోదిల చెప్పెనుగా గోవింద |

187. శ్రీనివాసునితొ కళ్యాణం

శుభకరమని చెప్పే గోవింద |

188. వకుళామాతా మరునాడు

నారాయణ పురమేగే గోవింద |

189. విషయమునంతా చెప్పెను

ఆకాశ రాజునకూ గోవింద |

190. రాజదంపతులా మాటకు

సంతసించినారూ గోవింద |

191. సంప్రదించె శుకమునితో

పద్మ పెండ్లికొరకై గోవింద |

192. దివ్యదృష్టితో చెప్పే

హరి శ్రీనివాసుడేనంటూ గోవింద |

193. లోక కళ్యాణమిది శుభము

చెయ్యండి వివాహమూ గోవింద |

194. లగ్నపత్రికను వ్రాసి

ఆశ్రమానికే వచ్చే గోవింద |

195. శుకమహర్షి శుభలేఖను

శ్రీనివాసునికందించే గోవింద |

*196*. వరాహస్వామికీ విషయం

తెలిపినదా వకుళా గోవింద |

*197*. పెండ్లికి కావలయునని

బోలెడంత ధనమూ గోవింద |

*198*. చిరునవ్వుతో వరాహుడూ

చింతవలదు తల్లీ గోవింద |

*199*. సర్వం శుభప్రదమగును

చూస్తూ ఉండమనే గోవింద |

*200*. లక్ష్మి చెంత లేక

శ్రీహరి చింతించే గోవింద |

*201*. ఆమెను రమ్మని ఆహ్వానం

సూర్యునితో పంపే గోవింద |

*202*. సూర్యుని చూచిన లక్ష్మి

భర్త క్షేమమడిగే గోవింద |

*203*. శ్రీహరి వివాహ విషయము

సూర్యుడు వివరించే గోవింద |

*204*. భర్త సౌఖ్యమే తనదంటూ

తలపోసిన లక్ష్మీ గోవింద |

*205*. సూర్యునితో కలసి

శేషాచలమున కొచ్చే గోవింద |

*206*. పెండ్లికి ఖర్చగు ధనమును

కుబేరుడిచ్చుటకూ గోవింద |

207. నారదుడిచ్చిన సూచనకు

సరియనె కుబేరుడూ గోవింద |

208. అంతట హరి కుబేరునితో

అసలు తీర్చలేనూ గోవింద |

209. కలియుగాంతము వరకు

వడ్డీ ఇచ్చెదను గోవింద |

210. ముల్లోకాలు మురిసేలా

జరిగెను వివాహమూ గోవింద |

# పెండ్లి పాట

ఆనందమానంద మాయెను

మా శ్రీనివాసుడు పెండ్లి కొడుకాయెను |

ఆనందమానంద మాయెను

మా పద్మావతి పెండ్లి కూతురాయెను ||

1. తడబడు అడుగుల వధువును

పీటల మీదికి పిలుచుకురాగా |

దంపతులిరువురి నడుమను

ఇంపగు వస్త్రము నిలుపగా|| || ఆనంద ||

2. చెలువగు శిరమున జీలకర్ర బెల్లము

ఒండొరులు నిలిపి ఉప్పొంగగా |

మంత్ర జాలములు మరులు గొలుపగా

అగ్ని సాక్షిగా అమరి యుండగా || || ఆనంద ||

3. కన్యాదానము జరిగిన పిదప

వధువు పదముపై కాలుంచి |

పెళ్ళి కుమారుడు తాళి కట్టగా

మాంగల్యం తంతునా నేన

మమ జీవన హేతునా

కంఠే బధ్నామి శుభగే

త్వం జీవ శరదాం శతం |

పెళ్ళి కుమారుడు తాళి కట్టగా

జల్లులై తలంబ్రాలు కురియగా || ఆనంద ||

211. శ్రీనివాసుడూ చేపట్టే

పద్మావతి హస్తమునూ గోవింద |

212. దగ్గరుండి జరిపించెను

శ్రీలక్ష్మి ఆ వివాహమూ గోవింద |

213. ఆనంద భాష్పాలొచ్చే

ఆమె కనులవెంటా గోవింద |

214. బయలుదేరిరా మరునాడు

వేంకటాచలమునకూ గోవింద |

215. వలచిన సతి పద్మావతితో

శ్రీనివాసుడపుడూ గోవింద |

*216*. మార్గ మధ్యమున అగస్త్యుని

ఇంట విశ్రమించే గోవింద |

*217*. అతనిని ధన్యుని చేసెను

మహా విష్ణుమూర్తీ గోవింద |

*218*. అటు పిమ్మట కొన్నాళ్ళకు

తన భక్తుండైనా గోవింద |

*219*. తొండమానునితో చెప్పే

శ్రీనివాసుడిట్లా గోవింద |

*220*. వెలసెద వేంకటాద్రిపై

వేంకటేశ్వరునిగా గోవింద |

*221*. కలియుగాంతము వరకు

పద్మావతి లక్ష్ములతో గోవింద |

*222*. మా నివాసమునకై

గుడిని కట్టించుమూ గోవింద |

*223*. అందుకు తగిన ప్రదేశము

వరాహుడు చూపించూ గోవింద |

*224*. అనగా విని తొండమానుడు

ఎంతటి భాగ్యమిదీ గోవింద |

*225*. అంటూ స్వామికి నివాసము

వేంకటాద్రిపై నిర్మించే గోవింద |

*226*. కొల్హాపురిన తపము చేసెడి

లక్ష్మిని చూచుటకూ గోవింద |

227. వెళ్ళెను నారదుడొకనాడు

హరి కుశలమడిగే గోవింద |

228. ఏమి చెప్పుదును నాతల్లీ

నీ ఊసే ఎత్తడుగా గోవింద |

229. పద్మావతియే సమస్తమై

ఉన్నాడాశ్రీనివాసుడూ గోవింద |

230. ఆ మాటలు విని శ్రీలక్ష్మి

వెంటనే ప్రయాణమయ్యె గోవింద |

231. శ్రీనివాసునాశ్రమమునకు

వచ్చెను నారదునితో గోవింద |

232. శ్రీనివాసుడా సమయమున

పద్మావతి తోడా గోవింద |

233. శృంగార లీలల తేలుతూ

ఆనందించు చుండే గోవింద |

234. ఆ దృశ్యము చూచిన లక్ష్మి

గుండె బాదుకుంటూ గోవింద |

235. అడిగినది శ్రీనివాసుని

కన్నెలెర్రజేసీ గోవింద |

236. తాళి కట్టిన భార్యనుగా

తగునా నను మరచుటా గోవింద |

237. వక్ష స్థల మందున్న

నను చులకన చేయుటకూ గోవింద |

*238*. అంతట పద్మావతి కూడా

కోపముతో ఇట్లనియే గోవింద |

*239*. దంపతులేకాంతమునుండ

వచ్చుట తగదంటూ గోవింద |

*240*. ఇరువురు భార్యలిట్లూ

తగవులాడుట చూచీ గోవింద |

*241*. ఏడడుగులు వెనుకకు నడిచి

శిలా రూపమయ్యెనూ గోవింద |

*242*. లక్ష్మీ పద్మావతులు

వెనుదిరిగి చూడగా గోవింద |

*243*. శిలారూపుడై నిలిచిన

శ్రీనివాసుని గాంచీ గోవింద |

*244*. నిర్ఘాంతపోయిన సతులు

తలలు బాదుకుంటూ గోవింద |

*245*. భోరున విలపించే

స్వామీ స్వామంటూ గోవింద |

*246*. దుఃఖించకండి సతులారా

ఈనాటి నుండి నేనూ గోవింద |

*247*. వేంకటేశ్వరుని నామమున

పిలువ బడుచుందునూ గోవింద |

*248*. ఈ రూపంతో కలియుగమంతా

భక్తుల కోరికలూ గోవింద |

*249*. తీర్చు చుందునూ తిరుమలలో
మ్రొక్కుల నందుకుంటూ గోవింద |

*250*. పద్మావతి ఎవరో కాదు
వేదవతియె సుమ్మీ గోవింద |

*251*. రామావతారము నందు
నిలిచెను మాయ సీత గానూ గోవింద |

*252*. మాట ఇచ్చితినపుడు
మనువాడెద నంటూ గోవింద |

*253*. అదే ఈనాటి వివాహము
ఆమె నీ అంశయే గోవింద |

*254*. అని హరి వివరించంగా
పద్మావతిని చూచీ గోవింద |

*255*. చెల్లీ! మన్నించుము తప్పు
అంటూ పలికినదీ గోవింద |

*256*. సంతసించె శ్రీనివాసుడు
తగవు తీరెనంతా గోవింద |

*257*. ఇరు వక్షముల ఇద్దరిని
నిలిపి ఉంచినాడూ గోవింద |

*258*. శిలగా మారిన శ్రీనివాసుని
తొండమానురాజూ గోవింద |

*259*. కట్టించిన దేవళమందు
ప్రవేశింపజేసే గోవింద |

*260*. పూమాలగమారెను వకుళ

హరి కంఠసీమ చేరే గోవింద |

*261*. ధన్యమయ్యె నా తల్లి కథ

ఈ కలియుగమందూ గోవింద |

*262*. తిరుపతికి సమీపాన

అలివేలుమంగ చేరా గోవింద |

*263*. దేవాలయము నిర్మించి

సరోవరము కట్టే గోవింద |

*264*. లక్ష్మీ నివాస మచ్చటనే

సిరి భక్తుల కొసగంగా గోవింద |

*265*. రాత్రులందు శ్రీనివాసుడు

మంగ పట్నమొచ్చూ గోవింద |

*266*. ఆదిశేషుని రూపమలా

శేషాచలమయ్యే గోవింద |

*267*. వేదములున్నందున

వేదాచలముగనూ గోవింద |

*268*. గరుత్మంతుడున్నందున

గరుడాచలముగనూ గోవింద |

*269*. వృషభాసురునికి మోక్షమిచ్చిన

వృషభాద్రిగానూ గోవింద |

*270*. అంజనాదేవి తపస్సుతో

హనుమంతుని పొందుటచే గోవింద |

*271*. అంజనాద్రిగా పేరొచ్చే

త్రేతాయుగంబునా గోవింద |

*272*. ఆదిశేషుడు వాయువును

పురిగొల్పుట వలనా గోవింద |

*273*. ఆనందాద్రియనిరి

ద్వాపరమందునా గోవింద |

*274*. కలియుగమున మన పాపాలు

పోగొట్టగ హరియే గోవింద |

*275*. శ్రీనివాసుడై వెలయుటచే

వెంకటాచలమయ్యే గోవింద |

*276*. వెంకటాచల ప్రదక్షిణము

సకల తీర్ధఫలమూ గోవింద |

*277*. వేంకటేశ్వరుని దర్శనము

సర్వపాప హరణం గోవింద |

*278*. కలియుగ వైకుంఠం

తిరుమల క్షేత్రములో గోవింద |

*279*. అరువది నాలుగు తీర్థములు

అలరారు చుండే గోవింద |

*280*. స్వామి పుష్కరిణి స్నానము

ఎంతో పుణ్యఫలం గోవింద |

*281*. సకల పాపాలు తొలగించీ

అందించును కైవల్యం గోవింద |

*282*. తలనీలాలను అర్పించి

ముడుపులనే చెల్లించీ గోవింద |

*283*. గోవిందా! గోవిందంటూ

ఏడుకొండలెక్కి గోవింద |

*284*. వేంకటేశ్వరుని దర్శించే

జనులు ధన్యులండీ గోవింద |

*285*. నమో వేంకటేశాయంటూ

మదిధ్యానించండీ గోవింద |

*286*. ఈ చరితము విను వారింట

సిరులే పొంగేనూ గోవింద |

*287*. స్వామి ప్రసాదము సేవిస్తే

పాపాలన్నీ తొలగూ గోవింద |

*288*. శ్రీనివాసుడెల్లపుడూ

మము కరుణ చూడుగాక! గోవింద |

వెంకటేశ వెంకటేశ - శ్రీనివాస శ్రీనివాస గోవింద!

# పెండ్లి పాటలు

శ్రీ పద్మావతి కళ్యాణం

ఇది శ్రీ వేంకటపతి కళ్యాణం

ఆది దంపతుల ఐక్యత చాటే

అద్వితీయ శుభ కళ్యాణం ||

కళ్యాణం కళ్యాణం కన్నుల పండుగ కళ్యాణం.

1. అవనీ జాతగ అవతరించిన
అతివకు జరిగే కళ్యాణం
శ్రీరామునిగ చెలువు మీరిన
చిత్తజ జనకుని కళ్యాణం || కళ్యాణం ||

2. ధరణీదేవి ఆకాశరాజుల
తనయకు జరిగే కళ్యాణం
ధరాధరముపై విడిది చేసిన
పరాత్పరుని వర కళ్యాణం || కళ్యాణం ||

3. సిరి దొరసానిని శ్రీగిరి దొరను
స్థిరముగ కలిపే కళ్యాణం
నిఖిల జగములకు శుభములు కూర్చే
చిత్ర నిరంజని కళ్యాణం || కళ్యాణం ||

4. ప్రకృతియైన పద్మావతిని
పురుషుడైన ఆ పరమపురుషుని

వైభోగముగ మన భాగ్యముగ
ఒక్కటి చేసిన కళ్యాణం. || కళ్యాణం || (2)

పాట (3) (తుళ్ళి తుళ్ళి పడుతుంది తుంటరి వయసు)

శ్రీనివాసుని కళ్యాణం చూడగరండి |
మళ్ళీ మళ్ళీ రాదండి ఈ శుభ తరుణం || శ్రీ ||

1. పెండ్లి కొమరుడైనా శ్రీనివాసుని చూచి
పొంగి పొంగి పోయే నారదాది మునులు
చల చల్లగ గంధం పూసి
మెల మెల్లగ గీతం పాడి
మురిసేను ఆ వకుళ మనసెంతనో || శ్రీ ||

2. బుగ్గ మీద కాటుకతో సిగ్గులొలికి పోయే
కోడలైన పద్మావతికి నగలనిచ్చె వకుళ
అత్తగ తానే మురిసేను
ఈ జన్మలో కోరిక తీరేను
మనసంత హాయిగ విహరించెనూ || శ్రీ ||

3. ఏడేడు లోకాలూ ఏకమై కదలా
భూదేవి మారే పెండ్లి పీటగా
తళతళలాడే బంగారు తాళి
పద్మావతి మెడలో కట్టే
జరిగేను కళ్యాణ వైభోగమే || శ్రీ ||

4. ఒకరికొకరు పోటీపడుతూ

తలంబ్రాలు పోసుకోగా

పూలవాన కురిసే ఝల్లు ఝల్లున

వకుళామాతా అక్షింతలేసె

అఖిలజగాలూ ఆనందించె

కని విని ఎరుగని కళ్యాణమే || శ్రీ ||

పాట(4) (సీతారాముల కళ్యాణము చూతము రారండి)

శ్రీహరి సిరిల కళ్యాణము చూతమురారండి |

మన శ్రీహరి సిరిల కళ్యాణము చూతము రారండి ||

చూచు వారలకు చూడముచ్చటట

పుణ్య పురుషులకు ధన్య భాగ్యమట

శక్తి యుక్తులకు ముక్తి ప్రదమట

భువిలో వెలసిన శ్రీనివాసునీ

కళ్యాణము చూతము రారండీ ||

1. పాల సంద్రమున పుట్టిన తల్లి

పుట్టిన తల్లి

వైకుంఠంబును మెట్టిన తల్లి

మెట్టిన తల్లి

దశావతారుని చేతిని పట్టీ ...

దశావతారుని చేతిని పట్టీ ...

ఏడూ అడుగులు నడిచిన

సిరి కళ్యాణము చూతము రారండీ

మన శ్రీహరి సిరిల కళ్యాణము చూతము రారండి ||

2. అవనిలో వెలసిన తొలి గృహిణివిగా

తొలి గృహిణివిగా

అంబుజ శోభిత అమ్మవు నీవు

అమ్మవు నీవు

ఆది మూలము నీవే జననీ ...

ఆది మూలము నీవే జననీ ...

ఆనందాంబుజ నిలయ నివాసిని

కళ్యాణము చూతము రారండి

మన శ్రీహరి సిరిల కళ్యాణము చూతము రారండి ||

3. పెండ్లి కుమారుడై శ్రీనివాసుడు

శ్రీనివాసుడు

నవ వధువైన పద్మావతితో

పద్మావతితో

కళ్యాణవేదిక చేరిన క్షణమూ ....

కళ్యాణవేదిక చేరిన క్షణమూ ....

ముల్లోకాలే మురిసిన సమయము

కళ్యాణము చూతము రారండీ |

మన శ్రీహరి సిరిల కళ్యాణము చూతము రారండి ||

4. కొలువు దీరెనూ శ్రీ పద్మావతి

శ్రీ పద్మావతి

శ్రీనివాసుని హృదయ నివాసిని

నివాసిని

పదసందడులూ ఘల్లు ఘల్లన ......

ఇలలో జరిగే కన్నుల పండుగ

కళ్యాణము చూతము రారండీ

మన శ్రీహరి సిరిల కళ్యాణము చూతము రారండీ |

5. శ్రవణము నందూ పుట్టిన స్వామికి

పుట్టిన స్వామికి

మృగ శీర్షములో పుట్టిన దేవికి

పుట్టిన దేవికి

వైశాఖ శుద్ధ దశమీ రోజున

వైశాఖ శుద్ధ దశమీ రోజున

ఉత్తర ఫల్గుణీ ధనుర్లగ్నమున

కళ్యాణము చూతము రారండీ

మన శ్రీహరి సిరిల కళ్యాణము చూతము రారండీ |

## *(5)*

పుడమిని పాలించే పురుషోత్తముడే

పెండ్లి కుమారుడాయెనమ్మ

సుదతులార కూడి ముత్యాలుజల్లి

శుభ హారతులియ్యరమ్మ

శుభ హారతులియ్యరమ్మ

వైభోగం, వైభోగం, వైభోగం, వైభోగం |

1. కనుగొన్న వారికీ కైవల్య మీయగా

కళ్యాణమూర్తి వరుడాయేనమ్మ

కళ్యాణమూర్తి వరుడాయేనమ్మ

సౌభాగ్య దాయినీ సంతోషకారిణీ

సౌభాగ్య దాయినీ సంతోషకారిణీ

అనంతలక్ష్మి పెండ్లికూతురాయె

వైభోగం మనభాగ్యం వైభోగం మనభాగ్యం

2. మంగళ వాద్యములే ముంగిట మ్రోగగ

ముంగిట మ్రోగగ

పీతాంబరధరుడే పీటను చేరగ

ముత్యాల తలంబ్రాలు ముచ్చటగా కురియగ

ముత్యాల తలంబ్రాలు ముచ్చటగా కురియగ

పరమాత్మునికి పరిణయమాయె

వైభోగం శుభ లగ్నం వైభోగం శుభలగ్నం |

3. వేద మంత్రజాలములు వినువీధినంటగా

వినువీధినంటగా

అవనీ జనులే ఆనందించగ

ముసిముసి నవ్వులతో ముద్దులొలుకు దేవినే

ముసిముసి నవ్వులతో ముద్దులొలుకు దేవినే

పరంధాముడే చేపట్టెనమ్మ |

పరంధాముడే చేపట్టెనమ్మ |

వైభోగం శుభతరుణం వైభోగం శుభతరుణం |

*(6)*

కమనీయం కడు రమణీయం

శ్రీ సప్త గిరీశుని కళ్యాణం

ఆనందం పరమానందం

ఇక సకల జగాలకు వైభోగం

*1.* మోహన రూపుడు శ్రీ శ్రీనివాసుడు

పెండ్లి కుమారుడు కావంగ

పెండ్లి కుమార్తెగ శ్రీ పద్మావతి

స్వామి సరసన చేరంగ |

*2.* వాణీ బ్రహ్మలు గౌరీశ్వరులు

పెండ్లి పెద్దలై నిలువంగ

సప్త మహర్షులు మునిశేఖరులు

వేద మంత్రములు చదువంగ || కమ ||

*3.* సకల సురలును సంతసంబుగా

స్వామి లీలలు పొగడంగా

సప్తగిరీశుని పెండ్లి శోభతో

అద్భుత కాంతులు చిందంగ || కమ ||

*4.* తుంబర నారద గంధర్వాదులు

సుమధుర గానము పలుకంగా

అప్సర గణము ఆనందముగ

అద్భుత నాట్యము చేయంగ || కమ ||

కళ్యాణమే వైభోగమే కళ్యాణమే వైభోగమే |

## (7) హారతి పాట

ముత్యాల హారతి పగడాల హారతి
వధూవరులకిదే వైఢూర్య హారతి |

1. సుప్రభాతము తోమాల సేవలు
శ్రీనివాస నీకిదే సువర్ణ హారతి |

2. సువర్ణ దళ పూజలు పూలంగి సేవలు
పరమాత్మ నీకిదె పగడాల హారతి |

3. వసంతోత్సవం ఉయ్యాల సేవలు
కోనేటి రాయునికి కోటి దీపాలు |

4. వజ్ర కిరీటం నిజరూప దర్శనం
కలియుగా దైవానికి నిత్య వైభవం |

5. వాహన సేవలు ఏకాంత సేవలు
బ్రహ్మాండ నాయకునికి బ్రహ్మోత్సవం |

6. తిరుమల క్షేత్రము శ్రీవారి దర్శనం
మోక్షధామమైనట్టి ముక్తి దాయకం |

ముత్యాల హారతి పగడాల హారతి
వధూవరులకిదే వైఢూర్య హారతి ||

## (8)

నమో వేంకటేశా నమో తిరుమలేశా
నమొ నమో తిరుమలేశా !
మహానంద మాయే ఓ మహాదేవదేవా !
ముడుపులు నీకొసగే - మా మ్రొక్కులు తీర్చుమయా |

ముక్తి కోరివచ్చే నీ భక్తుల బ్రోవుమయా !

నీ భక్తుల బ్రోవుమయా ! || నమో ||

నరక తుల్యమౌ ఈ భువి స్వర్గము జేయుమయా

మనుజులు నిను జేరే పరమార్థము తెల్పవయా

పరమార్థము తెల్పవయా || నమో ||

**(9)**

తిరుమల మందిర సుందరా

సుమధుర కరుణా సాగరా

ఏ పేరున నిను పిలిచేనురా

ఏ రూపముగా కొలిచేనురా || తిరు ||

పాల కడలిలో శేషశయ్యపై

పవళించిన శ్రీహరివో

వెండికొండపై నిండు మనసుతో

వెలిగే గౌరీపతివో

ముగ్గురమ్మలకే మూలపుటమ్మగ

భువిలో వెలసిన ఆదిశక్తివో || తిరు ||

కాంతులు చిందే నీ ముఖబింబము

కాంచిన చాలును ఘడియైనా

నీ గుడి వాకిట దివ్వెను నేనై

వెలిగిన చాలును రేయైనా

నీ పదములపై కుసుమము నేనై

నిలిచిన చాలును క్షణమైనా || తిరు ||

# శ్రీ వెంకటేశ్వర అష్టోత్తర శతనామావళి

ఓం వెంకటేశాయనమః

శ్రీనివాసాయనమః

లక్ష్మీపతేనమః

అనామయాయనమః

అమృతాంశాయనమః 5

జగద్వంద్యాయనమః

గోవిందాయనమః

శాశ్వతాయనమః

ప్రభవేమః

శేషాద్రినిలయాయనమః 10

దేవాయనమః

కేశవాయనమః

మధుసూదనాయనమః

అమృతాయనమః

మాధవాయనమః 15

శ్రీకృష్ణాయనమః

శ్రీహరయేనమః

జ్ఞానపంజరాయనమః

శ్రీవత్సవక్షసేనమః

సర్వేశాయనమః 20

గోపాలాయనమః

పురుషోత్తమాయనమః

గోపీశ్వరాయనమః

పరంజ్యోతిషేనమః

వైకుంఠపతయేనమః 25

అవ్యయాయనమః

సుధాతనవేనమః

యాదవేంద్రాయనమః

నిత్యయవ్వనమూర్తయేనమః

చతుర్వేదాత్మకాయనమః 30

విష్ణవేనమః

అచ్యుతాయనమః

పద్మినీప్రియాయనమః

ధరాపతయేనమః

సురపతయేనమః 35

నిర్మలాయనమః

దేవపూజితాయనమః

చతుర్భుజాయనమః

త్రిధామ్నేనమః

త్రిగుణాశ్రయాయనమః 40

నిర్వికల్పాయనమః

నిష్కళంకాయనమః

నిరాంతకాయనమః

నిరంజనాయనమః

నిరాభాసాయనమః 45

సత్యతృప్తాయనమః

నిరుపద్రవాయనమః

నిర్గుణాయనమః

గదాధరాయనమః

శారంగపాణయేనమః 50

నందకినేనమః

శంఖధరాకాయనమః

అనేకమూర్తయేనమః

అవ్యక్తాయనమః

కటిహస్తాయనమః 55

వరప్రదాయనమః

అనేకాత్మనేనమః

దీనబంధవేనమః

ఆర్తలోకాభయప్రదాయనమః

ఆకాశరాజవరదాయనమః 60

యోగిహృత్ పద్మమందిరాయనమః

దామోదరాయనమః

కరుణాకరాయనమః

జగత్ పాలాయపాపఘ్నాయనమః

భక్తవత్సలాయనమః 65

త్రివిక్రమాయనమః

శింశుమారాయనమః

జటామకుటశోభితాయనమః

శంఖమధ్యోల్ల సన్మంజుకింకిణ్యాధ్య కరండకాయనమః

నీలమేఘశ్యామతనవేనమః 70

బిల్వపత్రార్చనప్రియాయనమః

జగద్వ్యాపినేనమః

జగత్ కర్త్రేనమః

జగత్ సాక్షిణేనమః

జగత్ పతయేనమః 75

చింతితార్థప్రదాయకాయనమః

జిష్ణవేనమః

దాశార్హయానమః

దశరూపవతేనమః

దేవకీనందనాయనమః 80

శౌరయేనమః

హయాగ్రీవాయనమః

జనార్ధనాయనమః

కన్యాశ్రవణతారేజ్యాయనమః

పీతాంబరధరాయనమః 85

అనఘాయనమః

వనమాలినేనమః

పద్మనాభాయనమః

మృగయాసక్తమానసాయనమః

అశ్వారూఢాయనమః 90

ఖడ్గధారిణేనమః

ధనార్జనసముత్సుకాయనమః

ఘనసారలసన్మధ్యకస్తూరీ తిలకోజ్జ్వలాయనమః

సచ్చిదానంద రూపాయనమః

జగన్మంగళదాయకాయనమః 95

యజ్ఞరూపాయనమః

యజ్ఞభోక్త్రేనమః

చిన్మయాయనమః

పరమేశ్వరాయనమః

పరమార్థప్రదాయనమః 100

శాంతాయనమః

శ్రీమతేనమః

దోర్దండవిక్రమాయనమః

పరబ్రహ్మణేనమః

శ్రీ విభవేనమః 105

జగదీశ్వరాయనమః

వృషభాచలవాసినేనమః

ఓం వేదపుత్రగిరీశాయనమః 108

## మా వద్ద లభించు గ్రంథములు.

1. కర్మ సిద్ధాంతము. -రు.30.
2. శంకరాచార్యుల వారి భజ గోవిందం. -రు.100.
3. శంకరాచార్యుల వారి శ్రీ దక్షిణామూర్తి స్తోత్రం.-రు.100.
4. శంకరాచార్యుల వారి ఆత్మ బోధ. -రు.150.
5. భగవాన్ రమణ మహర్షుల ఉపదేశసారం. -రు.100.
6. సదా శివ బ్రహ్మేంద్రుల ఆత్మ విద్యావిలాసం. -రు.100.
7. నారద భక్తి సూత్రములు. -రు.150.
8. ఈశావాస్యోపనిషత్తు. -రు.100
9. కేనోపనిషత్తు. -రు.100.
10. కఠోపనిషత్తు. -రు.250.
11. ముండకోపనిషత్తు. -రు.200.
12. మాండూక్యోపనిషత్తు. -రు.200.
13. కైవల్యోపనిషత్తు. -రు.100.
14. బ్రహ్మ సూత్రములు. – 1 -రు.200.
15. బ్రహ్మ సూత్రములు. – 2 -రు.200.
16. గీతమాలిక. -రు.100.
17. భగవద్గీత 15 పుస్తకముల సెట్. - రు.1800.

వివరములకు.

సెల్ : 8008539770
8885539770
09886265225
PHONE: 08647-254716